క్లుప్తంగా

నాయకులకు సన్మానం



పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల పదవులకు ఎంపికైన నాయకులను పెనుగంచిప్రోలులో ఆపార్టీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కీసర లోకేష్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మెండెం రామారావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు బోశెట్టి బ్రహ్మంలను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, నాయకులు కాకాని హరి, ప్రసాద్, పెద్దోడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తొమ్మిది నెలల పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దాతలకు సత్కారం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఆలయ ధరకర్త పాలాది వెంకటరమణ ద్వారా దాతలు 14 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు పొందూరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల పెనుగంచిప్రోలులో టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి అక్రమ అరెస్ట్ కారణంగా రిమాండ్‌లో ఉంటున్న ఇద్దరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు విచారణ నిమిత్తం శనివారం పెనుగంచిప్రోలు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. బందరు సబ్ జైలులో రిమాండ్‌లో ఉంటూ విచారణ నిమిత్తం అనంతరం వారికి వైద్యపరీక్షల నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. అధైరపడవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, శివరాత్రి పృథ్వీరాజ్, పార్టీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ తదితరులు ఉన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

వీరులపాడు: వీఆర్వోలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ హుస్సేన్ హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరులో రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

రైతుల కన్నీటి వ్యధ

- కోల్డ్‌స్టోరేజీ ప్రమాద ఘటనతో తీవ్రంగా నష్టపోయిన మిర్చిరైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన భీమవరం గ్రామ మిర్చి రైతులు

వత్సవాయి: జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజీలో ఈనెల 25వ తేదీన చోటుచేసుకున్న అగ్నిప్రమాదం వందలాది మందికి మిర్చి రైతుల జీవితాలను రోడ్డున పడేసింది. కోల్డ్‌స్టోరేజీ నిర్వాహకుల నిర్వాకం కారణంగా రైతులు సర్వం కోల్పోయారు. అసలే గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి లేక పోవడంతో భవిష్యత్‌లో మంచి ధర లభిస్తుందనే ఆశతో మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేస్తే తీరా ఇలా అగ్నిప్రమాదం కారణంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

అధికశాతం మంది కౌలురైతులే..

ఈ కోల్డ్‌స్టోరేజీలో మిర్చిని నిల్వచేసుకున్నవారిలో భీమవరం మక్కపేట, గౌరవరం, ఇందుగుపల్లి, మంగొల్లు గ్రామాలకు చెందిన రైతులే అధికంగా ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది కౌలు రైతులు. కౌలుఖర్చులు, సాగు ఖర్చులు కలిపి ఎకరాకు లక్షకుపైగా ఖర్చుచేసి మిర్చి పంటను సాగు చేస్తే తీరా అగ్నిప్రమాదం రూపంలో తీవ్రంగా నష్టపోయామని, కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యాం ఇన్సూరెన్స్ సైతం చేయకుండా తమను మోసం చేసిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సమాధానం చెప్పేవారేరీ...

ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా బాధితులకు తగిన భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీ నిర్వాహకులు అధికార పార్టీకి చెందినవారు కావడమే ఇందుకు కారణమని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కోల్డ్‌స్టోరేజీ వద్దకు వస్తున్న బాధిత రైతులకు కనీసం సమాధానం చెప్పేవారే అక్కడ కరువయ్యారు. ప్రమాదం గురించి ప్రశ్నించే మిర్చిరైతులను కోల్డ్‌స్టోరేజీ వద్ద ఉన్న సిబ్బంది సైతం పరుష పదజాలంతో మాట్లాడుతుండటంపై రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ప్రమాదంలో కాలిపోతున్న కోల్డ్‌స్టోరేజీ(ఫైల్)

రిజిస్టర్లు మాయం?..

ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా..లేక కావాలని చేసిందా అనే సందేహం రైతుల నుంచి వినిపిస్తోంది.

ఇన్స్యూరెన్స్‌ను రెన్యువల్ చేసే విషయంలో కూడా కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిందనే చెప్పాలి. అగ్నిప్రమాదం చోటుచేసుకున్న తర్వాత కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉన్న మిర్చి వివరాలతో కూడిన రిజిస్టర్లు కూడా మాయం చేశారనే ప్రచారం సాగుతుండటం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. వేలాది బస్తాల మిర్చిని కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేస్తే, అందుకు తగిన రికార్డులు కూడా లేకపోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి తమకు వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు. భీమవరం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధిత మిర్చి రైతుల ఆవేదన వారి మాటల్లోనే

మాగోడు వినేవారే లేరు..



ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాను. మిర్చికి మద్దతు ధర లేకపోవటంతో పెరుగుతుందన్న ఆశతో కోల్డ్‌స్టోరేజీలో 107 బస్తాలు నిల్వచేశాను. అగ్ని ప్రమాదంలో మిర్చి అంతా కాలిపోయింది. మాగోడు వినేవారు కరువయ్యారు.

– చిక్కు సూర్య నారాయణ, కౌలు రైతు

కన్నీరే మిగిలింది...



మిర్చికి గిట్టుబాటు లేకపోవడంతో భవిష్యత్‌లో మంచి ధర వస్తుందనే ఆశతో 260 మిర్చి బస్తాలు సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజీలో నిల్వచేశాను. అగ్నిప్రమాదం కారణంగా మా ఆశలన్నీ అడియాసలయ్యాయి. కనీసం మా బాధలు పట్టించుకునేవారు కరువయ్యారు.

– రొయ్యల సైదులు, కౌలు రైతు

600 బస్తాలు నిల్వ చేశా..



ఈఏడాది ఏడు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. పంట బాగానే పండినప్పటికీ సరైన ధర లేకపోవడంతో కోల్డ్ స్టోరేజీలో 600 బస్తాలు నిల్వ చేశాను. అగ్ని ప్రమాదంలో నిల్వ ఉంచిన మిర్చి కాలిపోయింది. చివరికి అప్పులే మిగిలాయి.

– చిట్టా వెంకటరెడ్డి, రైతు

దిక్కుతోచడం లేదు..



కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన 470 టిక్కీలు అగ్నికి ఆహుతయ్యాయి. కౌలుకు 14 ఎకరాలు తీసుకుని మిర్చి పంట సాగు చేశాను. కొంత అమ్మి కూలీలకు చెల్లించగా మంచి ధర వస్తుందనే ఆశతో కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేశా. తీరా చూస్తే అగ్ని ప్రమాదంతో నిండా మునిగిపోయాం.

– ఏదులాపురం సైదులు, కౌలురైతు

బుగ్గిపాలైంది..



పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చిసాగు చేశాను. అప్పులు చేసి కూలీలకు డబ్బులు చెల్లించాను. మిర్చి ధరలు ఈ ఏడాది భారీగా తగ్గడంతో అమ్ముకోలేక 33 బస్తాలు కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేశాను. మిర్చి అంతా బుగ్గిపాలైంది.

– షేక్ మౌలాలి, కౌలు రైతు

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..



సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజీలో తాను నిల్వచేసిన 400 బస్తాల మిర్చి అగ్నికి ఆహుతైంది. మమ్మల్ని కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోకుంటే కోలుకోలేం.

– పెనుగొండ శ్రీనివాసరెడ్డి, రైతు

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు





నందిగామరూరల్/జగ్గయ్యపేటఅర్బన్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఉగాది పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలంటూ నందిగామ, జగ్గయ్యపేట ప్రజలకు వారు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌ను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పట్టణంలోని అమ్మాణీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, అమ్మాణీ, జేఆర్‌సీ, విశ్వభారతి కళాశాలల పాలకవర్గ ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, కొత్తమాజు మల్లికార్జునరావు, అబ్బులు, పెనుగొండ సతీష్, రమేష్, సుధీర్, తిరుపతిరావు, రామతులసి, నాయకులు మైనేని రాధా, కటికల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పురస్కార మహోత్సవం



సభలో మాట్లాడుతున్న కవి మేడిపల్లి అజయ్



ఉగాది పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

కంచికచర్ల : షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పండుగ మన సంస్కృతిలో భాగమని బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగిరాల సోనీ పేర్కొన్నారు. స్థానిక కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెడికల్ కళాశాలలో శనివారం ఉగాది పురస్కారాల అందజేత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా రంగాల్లో విశేష కృషిచేస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ సెక్రటేరియట్ గెజిటెడ్ అధికారుల సంఘం చైర్మన్ కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ కంచికచర్లలో ఉగాది కవి సమ్మేళనం జరుపుకోవడం అభినందనీయమన్నారు. సమాజంలో అనేక రుగ్మతలను ఈ ఉగాది పోగొట్టాలని ఆకాంక్షించారు. కవి, నందిగామ ఎక్సైజ్ సీఐ బంగార్రాజు, రచయిత అజయ్ మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని కవులు, కళాకారులు, జర్నలిస్టులను సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెడికల్ కళాశాల అధినేత కేవీ కృష్ణారావు మాట్లాడుతూ ఉగాది పురస్కారాల అందజేత కార్యక్రమానికి తమ కళాశాల వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి సాహిత్య కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆయారంగాల్లో కృషి చేసిన కవులు, రచయితలు, జర్నలిస్టులు, ఉపాధ్యాయులైన శిఖా ఆకాష్, బంగార్రాజు కంఠ, అజయ్ మేడిపల్లి, షేక్ ఇస్మాయేలు, తాతినేని సూరిబాబు, కర్ల రవికుమార్, విబిఎస్ఎస్ ప్రసాద్, కె.లక్ష్మీనారాయణ, దగ్గుపాటి ఏసురత్నం, బొక్కా ప్రభాకరరావు, వేముల భిక్షమయ్య, పిల్లి స్వరూపారాణి, జాలూరి విశ్వనాథం, గురజాల శ్రీనివాసరావు, శేషం స్వామి, కేవీ కృష్ణయ్యకు ఉగాది పురస్కారాలు అందజేశారు. దుశ్శాలువ, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. వేద పాఠశాల, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం 10.30గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

50 మందికి వైద్య పరీక్షలు



నందిగామరూరల్: ఆయుర్వేద వైద్యంతో మంచి ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కొప్పుల కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడులో శనివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 50 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు గర్నిడి సురేష్, ఏపూరి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి : సీపీఐ



బాధిత రైతులతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు

భీమవరం(వత్సవాయి): జగ్గయ్యపేట సమీపంలోని సాయితిరుమల కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదం కారణంగా నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన భీమవరం గ్రామంలోని మిర్చి రైతులను శనివారం ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్ నిర్వాహకులు సరైన నిబంధనలు పాటించనందునే అగ్నిప్రమాదం చోటుచేసుకుని రైతులు నష్టపోయారన్నారు. అసలే గిట్టుబాటు ధర లేక భవిష్యత్తులోనైనా మంచి ధర వస్తుందనే ఆశతో స్టోరేజ్‌లో పెట్టుకున్న రైతులు ఈ ఘటనతో నిండా మునిగారన్నారు. విద్య, వైద్యం, పిల్లల వివాహాల సమయానికి పంటను అమ్ముకోవచ్చని దాచుకున్న రైతుల ఆశలన్నీ బుగ్గిపాలయ్యాయన్నారు. కోల్డ్‌స్టోరేజీలో నిల్వచేసిన మిర్చిపై నిర్వాహకులు రూ.7కోట్ల వరకు రుణం తీసుకున్న విషయం బాధిత రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చే వరకు తెలియదన్నారు. ఈ ప్రమాదం కేవలం మానవ తప్పిదమేనని పేర్కొన్నారు. అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన మిర్చి రైతుల తరపున పోరాడి వారికి సరైన న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి చుండూరు సుబ్బారావు, సీనియర్ నాయకులు బుట్టి రాయప్ప, సీహెచ్ యలమందరావు, బుడ్డి రమేష్, పొన్నం నరసింహరావు, వల్లంకొండ బ్రహ్మం, పద్మాల వెంకటేశ్వరరావు, మాశెట్టి రమేష్, మెటికల శ్రీనివాస్, షేక్ జానీ, గ్రామ పార్టీ నాయకులు గుండం రంగారెడ్డితదితరులు పాల్గొన్నారు.

3న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): బీసీ, ఈబీసీ, కాపు కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఏప్రిల్ 3వతేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. రుణాల మంజూరు కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి 961 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా శాఖలు, బ్యాంకు అధికారుల సమక్షంలో దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 3వతేదీ ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

రామ్‌కోలో ముందస్తు ఉగాది వేడుకలు



రామ్‌కోలో ఉగాది పురస్కారాలు అందజేస్తున్న ప్రెసిడెంట్



గండ్రాయిలో నమాజ్ చేస్తున్న విద్యార్థులు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ముందస్తు ఉగాది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ మాట్లాడుతూ తెలుగువారి తొలి పండుగ ఉగాది నూతనోత్సాహంతో ప్రతిఒక్కరు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కర్మాగారం దత్తత గ్రామాలు జయంతిపురం, కెఅగ్రహారం, రావిరాల, ధర్మవరప్పాడుతండ, బూదవాడ గ్రామాల్లోని గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దలను ఉగాది పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్‌విఆర్‌కె మూర్తిరావు, సీనియర్ మేనేజర్ ఫరూక్ అహ్మద్, డీజీఎం రామకృష్ణసాయి, తదితరులు పాల్గొన్నారు.

గండ్రాయిలో..

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథకోన్నత పాఠశాలలో వినూత్నంగా ముందస్తుగా ఉగాది, రంజాన్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడి చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా నమాజ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రమాదేవి, పద్మావతి, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవి తదితరులు

గండేపల్లి(కంచికచర్ల): వేసవిలో పాదచారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జై డ్రైవర్ యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మార్కపూడి లాజరు, కూసు రవి తెలిపారు. మండలంలోని గండేపల్లిలో వారు శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాదచారులు, తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జై యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. తొమ్మండ్రు తిరుపతిరావు, సభ్యులు యాదాల సూర్యప్రకాష్, షేక్ దాదయ్య, పడిగల నాగరాజు, కృష్ణ, రమేష్, గ్రామ నాయకులు సుంకు వెంకట బాల పిచ్చయ్య, చోడగిరి సతీష్, మట్టా సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించిన తన్నీరు



జగ్గయ్యపేటఅర్బన్: మాతృ వియోగంతో బాధపడుతున్న రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు. బాపట్ల జిల్లా మేదరమెట్లలోని వైవీ సుబ్బారెడ్డి ఇంటికి తన్నీరు నాగేశ్వరరావు శనివారం వెళ్లి ఆయనను పరామర్శించారు. వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైవీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైవీని పరామర్శించిన వారిలో ఆపార్టీ ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తనుబుద్ది చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది శివరాత్రి పృథ్వీరాజ్, పేట పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ తదితరులు ఉన్నారు. పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి, లక్ష్మీదేవి పూజ చేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఉగాది ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను వైభవంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రియాజ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సత్యలక్ష్మిప్రసన్న

నందిగామ టౌన్: విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ సూచించారు. పట్టణంలోని ఎంఆర్‌ఆర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో, సైబర్ క్రైమ్, డ్రగ్స్, మోటార్ వాహనాల ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కొత్తవారు చూపించే ప్రేమను చూసి మోసపోవద్దని, చెడుప్రవర్తన కలిగిన వ్యక్తులను గుర్తించినప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం జడ్జి రియాజ్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు మౌలేశ్వరరావు, ఆజాద్, విజయభాస్కర్, కళాశాల డైరెక్టర్ భానుచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చందర్లపాడు(నందిగామ రూరల్): విద్యార్థులు సత్ప్రవర్తనతో నడుచుకోవడంతోపాటు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సత్యలక్ష్మిప్రసన్న సూచించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యలక్ష్మిప్రసన్న మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాం తదితర మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకుని ఎంతో మంది మోసపోతున్నారని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నందిగామ రూరల్ సీఐ చవాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, కార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు గింజుపల్లి రమేష్, శ్రీనివాసరావు, ప్రదానోపాధ్యాయుడు పెసరమల్లి జాన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.